

విద్యార్థి చదువుకు అండగా పోలీసులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని సత్తిరెడ్డి పేటకు చెందిన బాలుడు కర్రి యశ్వంత్ చదువుకు పెద్దాపురం పోలీసులు అండగా నిలిచారు. బాలుని తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. నానమ్మ దగ్గరే ఉంటూ ట్రినిటీ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. ట్రినిటీ స్కూల్లో చదువుతుండగా తల్లిదండ్రులు మరణిండంతో చదువు ఆగిపోయే పరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న అప్పటి డిఎస్పి లతా కుమారి ఒక సంవత్సరం విద్యా సంవత్సరానికి అవసరమైన ఫీజులు, పుస్తకాలకు అవసరమైన నగదు సమకూర్చారు. అనంతరం ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు ఈ విద్యా సంవత్సరానికి అవసరమైన ఆర్థిక సహకారాన్ని శనివారం అందజేశారు.

కానరాని పర్యాటకాభివృద్ధి

- ప్రకృతి అందాలు అనేకం
- అభివృద్ధికి నోచుకోని వైనం
- సౌకర్యాల్లేక ఆదాయానికి గండి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పర్యాటక అభివద్ధిలో కాకినాడ జిల్లా వెనుకబడి ఉంది. ఇక్కడ కేరళను మించి అందాలున్నాయని, గోవాను మించి బీచ్‌లు ఉన్నాయని పలువురు భావిస్తుంటారు. ప్రభుత్వ మాత్రం పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పర్యాటక అభివద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సాధారణ ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం అనూహ్యంగా విజయం సాధించింది. పర్యాటక శాఖ మంత్రిగా కందుల దుర్గేష్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో ఈ జిల్లా పర్యాటకంగా పెద్ద ఎత్తున అభివృద్ధి చెందుతుందని అందరూ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పర్యాటక ప్రదేశాలు అభివద్ధికి ఆయన కృషి చేయాల్సి ఉంది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది అయినప్పటికీ ఈ ప్రదేశాల అభివద్ధిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో పర్యాటక ప్రేమికులు పెదవి విరుస్తున్నారు.



అభివృద్ధి నిలిచిపోయిన కాకినాడ బీచ్

అపారమైన అవకాశాలు

జిల్లాలో అపారమైన పర్యాటక అభివృద్ధికి అవకాశాలున్నా పాలకులు పట్టించుకోకపోవడంతో భారీగా ఆదాయానికి గండి పడుతోంది. సుదీర్ఘ సాగరతీరం, పచ్చని కొండలు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన ఆలయాలు, ప్రముఖ దర్శనీయ ప్రదేశాలు, కొడవలి బౌద్ధ స్థూపాలు, చారిత్రక ప్రాంతాలు ఇక్కడ కొలువై ఉన్నా అధికారులు సైతం నిర్లక్ష్యపు దృష్టితోనే ఉన్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేసి, సౌకర్యాలు కల్పించే వీలున్నా పట్టనట్లే వ్యవహరిస్తున్నారని పర్యాటకులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా కాకినాడ జిల్లా ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. తొండంగి నుంచి కాకినాడ వరకు సువిశాల సాగరతీరం పర్యాటకులను ఆకర్షిస్తోంది. సముద్రం మధ్యలో హోప్ ఐలాండ్ పర్యాటకులను కట్టిపడేస్తోంది. కోరంగి మడ అడవులకు ఎంతో ప్రసిద్ధి. అన్నవరం నుంచి తలుపులమ్మలోవ, సామర్లకోట భీమేశ్వరస్వామి, పిఠాపురం పురుహూతికా అమ్మవారి ఆలయాలకు ఎక్కడెక్కడి నుంచో సందర్శకులు వస్తుంటారు. రెండు తెలుగు రాష్ట్రాలతో బాటు దేశ, విదేశాల నుంచి కాకినాడ జిల్లాకు ఏటా దాదాపుగా 25 లక్షల మంది పర్యాటకులు ఇక్కడకు వస్తున్నారు. ప్రధానంగా కాకినాడ కేంద్రంగా వాకలపూడి బీచ్ పార్క్, లైట్ హౌస్, కుంభాభిషేకం, కాకినాడ పోర్ట్, ఫిషింగ్ హార్బర్, శిల్పారామం, ఆ పక్కనే గెస్ట్ హౌస్, కాకినాడ శివారులో జగన్నాథపురంలోని ఫ్రెంచ్ డచ్, బ్రిటిష్ వాళ్ళు నిర్మించిన చర్చి సముదాయాలు పర్యాటకంగా పేరొందాయి. ఈ ప్రాంతాలకు అనేకమంది తాకిడి ఎక్కువగా ఉంటుంది.కాకినాడ సమీపంలో ఉప్పాడ బీచ్ రోడ్డు కనువిందు చేస్తుంది.

పర్యాటకాభివృద్ధి జరిగితేనే...

కోరంగి మడ అడవులు, కాకినాడ, ఎస్.యానాం, ఉప్పాడ సముద్ర తీర ప్రాంతాలు ఇలా అనేక పర్యాటక ప్రదేశాలున్న జిల్లాకు పర్యాటకుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం, సామర్లకోట భీమేశ్వరస్వామి టెంపుల్, పిఠాపురం పాదగయ దేవస్థానం (దక్షిణ కాశీ) టెంపుల్ టూరిజాన్ని మరింతగా అభివృద్ధి చేయాలి. కాకినాడ బీచ్ అభివద్ధి నిలిచిపోయింది. దీంతో జిల్లా పర్యాటకాభివద్ధి ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్పాడలో తలపెట్టిన హోటల్ మేనేజ్మెంట్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణ పనులు కొన్నేళ్లుగా నిలిచిపోయాయి. రూ.12 కోట్ల వ్యయంతో దీని నిర్మాణం చేపట్టినా కొన్ని కారణాలతో ఏళ్లు కావస్తున్నా పనులు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. హార్బర్ పనులను వేగవంతం చేయాలి. ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్ రక్షణకు శాశ్వత పరిష్కార మార్గాలు చూపాలి. జిల్లా కేంద్రం కాకినాడకు ప్రధాన రైల్వే లైన్ కు లింకు చేయాలి. పరిశ్రమలు స్థాపించి పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

ఆదాయం పెరిగే అవకాశం

జిల్లాలో పలు పర్యాటక ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేవు. సందర్శకులు వచ్చినా కనీసం కూర్చోవడానికి సైతం వసతులు కనిపించడం లేదు. దీంతో అనేకమంది తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పర్యాటకుల ఇటువైపు రావడం తగ్గించేశ్శారు. ఉదాహరణకు కాకినాడ ఎన్టీఆర్ బీచ్ ద్వారా సుమారు రూ.18 లక్షలు, కోరంగి రిసార్ట్స్ నుంచి రూ.9 లక్షలు ఆదాయం ప్రతి నెలా వచ్చేది. గత ఐదేళ్లుగా మూతబడి ఉండడతో రూపాయి కూడా ఆదాయం లేకుండా పోయింది.

భారీగానే ప్రణాళికలు

స్వర్ణాంధ్ర-2047 పేరుతో జిల్లాలో 2029లోగా పర్యాటక రంగం అభివద్ధిని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై ప్రత్యేక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. దీని ప్రకారం రూ.35 కోట్లతో పలు కీలక ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనల ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 18 బీచ్‌లను ఎపి కోస్టల్ జోన్ టూరిజం మాస్టర్ ప్లాన్ కింద అభివద్ధి చేసే అవకాశం ఉందని నివేదికలో వివరించారు. తొలుత తొండంగి మండలంలోని దానవాయిపేటలోని బీచ్‌ను రూ.10 కోట్లతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు తయారు చేశారు.

మత్స్యకారుల హక్కులను కాపాడాలి

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకార హక్కులను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నాయని మత్స్యకారులుకు రావాల్సిన నష్టపరిహారం ప్రభుత్వాలు అందడం లేదని మత్స్యకార, మత్స్య కార్మిక జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు సిహెచ్.రమణి అన్నారు. శనివారం ఉప్పాడ రింగ్ రోడ్డు సెంటర్లో మత్స్యకారులకు సమస్యలపై అవగాహన కల్పిస్తూ మానవహారం చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్రపు అలలకు గృహాలు కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సముద్రంలో ఉన్న ఖనిజ సంపదను వెలుగు తీసేందుకు ప్రయత్నాలు చేస్తుందని దాని ద్వారా మత్స్యకార కుటుంబాలకు రోడ్డున పడే ప్రమాదం ఉందని తెలిపారు సముద్రంపైనే వేటాడి జీవనం సాగిస్తూ ఉంటున్న మత్స్యకారులు పొట్ట కొట్ట వద్దన్నారు మత్స్యకార గ్రామాల్లో నాయకులు పర్యటించి వారి స్థితిగతులు తెలుసుకుంటే మత్స్యకారుల ఆవేదన తెలుస్తుందన్నారు. త్వరలోనే ఎపి మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో జీపు జాత ఏర్పాటు చేసి తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలు తెలుసుకుంటామని తెలిపారు. మత్స్యకారులు ఆగ్రహించి రోడ్డు ఎక్కితే ప్రభుత్వాలు కూలిపోతాయన్నారు పవన్ కల్యాణ్ ఎన్నికల సమయంలో మత్స్యకారులకు అండగా ఉంటామని తెలిపి ఓట్లు వేయించుకొని గెలిచిన తర్వాత మత్స్యకారులను గాలికి వదిలేసారన్నారు. సముద్రంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న నష్టపరిహారం సైతం అందడం లేదని అన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో నష్టపోతున్న మత్స్యకారులకు ఏ విధంగా నష్టపరిహారం చెల్లిస్తున్నారో, అదే విధంగా ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారులకు కూడా నష్ట పరిహారం చెల్లించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నాయకులు గుర్రాల అప్పారెడ్డి, కె.నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు ఉప్పాడ సత్యనారాయణ, నక్క పోలరాజు, మెరుగు ఎల్లాజీ, పి.పోలయ్య, డి.సంసోన్, రాచపల్లి నల్లయ్య, చొక్కా ప్రసాద్, సంజీవ్, రాకాతి యాకబ్, కారే అన్నవరం పాల్గొన్నారు.



మత్స్యకారుల ధర్నాలో మాట్లాడుతున్న సిహెచ్.రమణి

విజన్ ప్లాన్‌కు సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 9న సిఎం చంద్రబాబు అన్ని జిల్లాల, నియోజకవర్గాల విజన్ ప్లాన్ ఆవిష్కరించనున్నారని, దీనిపై జిల్లా అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ హాల్లో విజన్ ప్లాన్‌పై సంబంధిత అధికారులు, జిల్లా, నియోజకవర్గ స్థాయి విజన్ ప్లాన్ ఆవిష్కరణ, రైసింగ్ స్టార్స్ అవార్డ్స్ ప్రధానోత్సవం, జిల్లాలో గత జూన్ నుంచి ఇప్పటివరకు పూర్తయిన పనులు ప్రారంభోత్సవాలు, మంజూరు చేసిన పనులు, శంకుస్థాపనలపై కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 9న నిర్వహించే సిఎం కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు, యోజకవర్గ ప్రత్యేక అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవ్వాలని సూచించారు. 9వ తేదీనే జిల్లాలో 10వ తరగతి, ఇంటర్‌లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డుల ప్రదానం, నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం బాలాజీ చెరువులోని టిటిడి కల్యాణ మండపంలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ నెల 11న ప్రతి నియోజకవర్గంలో ఇప్పటివరకు పూర్తి చేసిన పనుల ప్రారంభోత్సవం చేపట్టాలని, నూతనంగా మంజూరు చేసిన పనులకు శంకుస్థాపనలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఒ జె.వెంకట్రావు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి



యూనిఫారాలు అందజేస్తున్న డిఎస్పీ శ్రీహరి రాజు

ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

ట్రాఫిక్ నిబంధనల పాటనతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించాలని డిఎస్‌పి శ్రీహరి రాజు సూచించారు. శనివారం సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో డ్రైవర్ల యూనిఫామ్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆటో డ్రైవర్లు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణికులకు మరింత నమ్మకంగా సేవలందించాలని తెలిపారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు. ప్రయాణికుల భద్రతతో పాటు రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా నడవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎ.కృష్ణ భగవాన్, క్రైమ్ సిఐ అంకబాబు, ట్రాఫిక్ సిబ్బంది సన్యాసిరావు, శ్రీను, ఈశ్వరరావు, సత్యనారాయణ, సరోజిని పాల్గొన్నారు. పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు, వేట్లపాలెం, ద్వారపూడి, ఉండూరుకు చెందిన సుమారు 100 మంది ఆటో డ్రైవర్లకు యూనిఫామ్లు పంపిణీ చేశారు.

సత్యనారాయణరాజుకు ఘన నివాళి

ప్రజాశక్తి-కాకినాడ

ఉపాధ్యాయ ఉద్యమ నేత, ఇపిఎఫ్ పెన్షనర్ల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన చుక్కన సత్యనారాయణరాజు ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. శనివారం సుందరయ్య భవన్‌లో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, జి.బేబిరాణి, వర్మ, అయితాబత్తుల రామేశ్వరరావు సత్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సత్యనారాయణరాజు ఉపాధ్యాయునిగా ఏజెన్సీలోనూ సేవలు అందించారని, సంఘంలో ఏ బాధ్యతల్లో ఉన్నా అంకిత భావంతో పనిచేసారని గుర్తు చేశారు. ఆయన సమాజ సంక్షేమం కోసం అహర్నిశలు పని చేశారన్నారు. స్వతహాగా కళాకారుడైన సత్యనారాయణరాజు క్రమశిక్షణలో ముందుపీఠిన నిలిచారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషబాబ్జీ, సిహెచ్.రాజ్‌కుమార్, నాయకులు యు.సత్యనారాయణ, మలకా వెంకట రమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, కె.వీరబాబు, చంద్రమళ్ల పద్మ, సిహెచ్.సతీష్, ఎం.హరనాథ్, కరణం విశ్వనాథం, రొంగల ఈశ్వరరావు, సిహెచ్‌వి.రమణ, టి.రాజా, పి.రామకృష్ణ, కె.సత్యనారాయణ, రాణి, పద్మ, రవికుమార్, మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.



సత్యనారాయణరాజు నివాళులు అర్పిస్తున్న నాయకులు

7 వేల మందితో ప్రత్యేక యోగా

ప్రజాశక్తి-కాకినాడ

వివిధ వృత్తులలో పని చేస్తున్న ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించవచ్చని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన ప్రత్యేక యోగా కార్యక్రమం శనివారం కాకినాడ మెయిన్ రోడ్డు టూ టౌన్ పోలీస్ నుంచి ఎల్ఐసి బిల్డింగ్ సెంటర్ వరకూ నిర్వహించారు. ఈ యోగా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఎంఎల్‌సిలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, కాకినాడ స్మార్ట్ సిటీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన, అడిషనల్ ఎస్‌పి మానిష్ పాటిల్ దేవరాజ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు, పాడా పీడీ చైత్ర వర్షిణి, కాకినాడ ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, సుమారు 7 వేల మంది ఉపాధ్యాయులు హాజరై యోగాసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో గత నెల మే 21 నుంచి ఈ నెల 21 వరకు నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం పని చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి ఇప్పటివరకు 8.5 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు.జిల్లాలో శనివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాల ఉపాధ్యాయులతో భారీ స్థాయిలో యోగా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.

ఆదర్శ విద్యా సంస్థగా త్రివర్ణ విద్యాలయం



కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు


ప్రజాశక్తి-సామర్లకోట

మండలంలో 25 ఏళ్లుగా విశిష్ట సేవలతో విద్యారంగంలో వెలుగొందుతున్న త్రివర్ణ స్కూల్ ఒక ప్రగతిశీల విద్యా సంస్థగా రూపుదిద్దుకుంది. నైపుణ్య పూరిత, సామాజిక విలువలకు, సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇస్తూ, విద్యార్థులకు వినయం, విధేయత, బుద్ధి, శారీరక, మానసిక వికాసాన్ని లక్ష్యంగా పెట్టుకుని విద్యా బోధన సాగిస్తోంది. త్రివర్ణ స్కూల్ ఎన్నో విజయాలు సాధిస్తూ, విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపే ఆదర్శ విద్యా సంస్థగా నిలిచిందని కరస్పాండెంట్ తోటకూర వెంకటేశ్వరరావు తెలిపారు.



కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తున్న హరి లోకేష్ మాష్టారు

పేరు వెనుక పరమార్థం



'త్రివర్ణ' అనే పదం భారత జాతీయ పతాకంలోని మూడు రంగులను సూచిస్తుండగా, ఈ స్కూల్ విద్యా విధానాలు కూడా క్రమశిక్షణ, జ్ఞానం, సేవాభావం అనే మూడు విలువలపై నిలబడినవి..

ఎల్‌కెజి నుండి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్యను అందిస్తున్న త్రివర్ణ, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంతో విద్యార్థులకు ఒత్తిడి లేని ఆహ్లాదకర వాతావరణంలో విద్యను అందజేస్తోంది. విశాలమైన స్కూల్ భవనం, అందమైన తరగతి గదులు, పెద్ద ఆటస్థలం, షటిల్, వాలీబాల్, కబడ్డీ కోర్టులు ఈ స్కూల్‌కు అదనపు సౌకర్యాలుగా నిలుస్తున్నాయి.

యోగా, కరాటే, భరతనాట్యం, కూచిపూడి వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల శారీరక-మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తున్నారు. విద్యా సంవత్సరంలో అనేక ప్రదర్శనలు నిర్వహించి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపునకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

25 ఏళ్లుగా 100 శాతం ఉత్తీర్ణత సాధించడం త్రివర్ణ ప్రత్యేకత. ప్రతిభావంతులైన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందించి సత్కరిస్తారు. 6వ తరగతి నుంచే ఐఐటి, నీట్‌కు శిక్షణ అందించడం మరో విశేషం. ఈ విద్యా సంవత్సరం నుండి ఎల్‌కెజి నుండి 5వ తరగతి వరకు స్క్రీన్ల ద్వారా డిజిటల్ బోధన ప్రారంభించారు.



బహుమతులు అందిస్తున్న తోటకూర సాయిరామకృష్ణ


ప్రతి నెలా టీచర్లు, తల్లిదండ్రులు, యాజమాన్యం కలిసి విద్యార్థుల అభ్యున్నతిపై చర్చలు జరిపి, వారి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. నో బ్యాగ్ డే విధానంతో చిన్న తరగతుల విద్యార్థులకు భారం లేకుండా విద్యను అందిస్తున్నారు.

సైన్స్, సోషల్ ప్రాజెక్టులలో విద్యార్థులు మండల స్థాయిలో ప్రతిభ చాటుతుండగా, భాషా ప్రావీణ్య పోటీల్లో తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇక్కడి పూర్వ విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో, ప్రైవేట్ రంగాల్లో డాక్టర్లు, ఇంజనీర్లు, సిఎలుగా ఉన్నత స్థానాల్లో వెలుగొందడం ఈ త్రివర్ణ విద్యార్థుల ప్రతిభకు తార్కాణం

ఫీజులు చెల్లించలేని ప్రతిభావంతుల విద్యార్థులకు రాయితీలు అందించడంతో పాటు, తక్కువ ఖర్చుతో ట్రాన్స్‌పోర్ట్ సదుపాయాలను కల్పిస్తున్నారు.

కార్టూ'నిజం'



బాధితురాలికి వీల్ చైర్ అందజేత

ప్రజాశక్తి -కరప

పెనుగుదురు గ్రామానికి చెందిన నెర్వస్ సిస్టమ్ సమస్యతో బాధ పడుతున్న పడాల హేమ కీర్తనకు రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ వీల్‌చైర్ అందజేశారు. జనసేన నాయకులు బండారు మురళి గంట మల్లేశ్వర స్వామి ఈ విషయాన్ని ఎంఎల్ఎ నానాజీ దష్టికి తీసుకెళ్లగా పంతం ఫౌండేషన్ ద్వారా రూ.12000 విలువైన వీల్‌చైర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో భోగిరెడ్డి కొండబాబు, ముద్రగడ రమేష్, మెండు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కాల్వల ఆధునికీకరణ అంతంత మాత్రమే

ప్రజాశక్తి- తాళ్లరేవు



అంతంత మాత్రంగా సాగుతున్న ఆధునీకరణ పనులు

పంట కాలువకు సాగునీరు విడుదల చేసిన తర్వాత అధికారులు ఆధునీకరణ పనులు ప్రారంభించారు. మండలంలోని ఇంజరం నుంచి పిల్లంక వరకు గత వారం రోజులుగా బ్యాంక్ కెనాల్ ఆధునీకరణ పనులు చేస్తున్నారు. కాలువ నీరు విడుదల చేసిన తర్వాత పనులు చేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. నీటిలోనే పనులు చేస్తూ లోపల ఉన్న మట్టిని తవ్వకుండా ఒడ్డున ఉన్న మట్టిని తీసి గట్టుపై వేస్తున్నారు. మండలంలో పిల్లంక నుంచి మల్లం కోట లాకు వరకు సుమారు పది కిలోమీటర్లు మేర చేపట్టిన ఆధునీకరణ పనులు అంతంత మాత్రం గానే సాగుతున్నాయి. ఇంజరం వంతెన వద్ద కాలువలో ఉన్న సిల్ట్ తొలగించకపోవడం వల్ల మళ్లీ సాగునీరు ప్రవాహానికి ఇబ్బందులు రానున్నాయి. గట్టుపై కొంత మట్టిని చూపించి బిల్లులు చేసుకోవడానికేనా ఈ ఆధునీకరణ పనులు అని సాటి రైతాంగం ముక్కున వేలేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నీటి ప్రవాహాన్ని తగ్గించి పంట కాలువ మధ్యలో ఉన్న సిల్ట్‌ను తొలగించాలని కోరుతున్నారు.

కాలువ పూడికతీత పనులు ప్రారంభం


ప్రజాశక్తి -కరప

సిరిపురంలోని పంట మురుగు కాలువ పూడికతీత పనులను ప్రారంభించినట్టు జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తెలిపారు. పంట, మురుకు నీరు కాలువలను పూడికతీత పనులను చేయించకుండా గత ప్రభుత్వం వ్యవహరించిందని జనసేన మండల ప్రధాన కార్యదర్శి నున్న సురేంద్ర విమర్శించారు. శనివారం గ్రామంలోని రాజు పంట కాలువ, మురికి కాలువ పూడికతీత పనులను ఎంఎల్ఎ ఆదేశాలతో ప్రారంభించినట్టు వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనులు ప్రారంభంతోని గ్రామంలోని రైతులు, కౌలు రైతులు కాలవ పనులు ప్రారంభించినందుకు ఎమ్మెల్యేలకు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గ్రామ అధ్యక్షుడు మాధవ్, ఎం వీరబాబు కొలిశెట్టి వివి సత్యనారాయణ, నున్న పాతీయులు నున్న గోవిందు సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులకు ఉత్తరకంచిలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ ఏడాది పదో తరగతిలో స్కూల్ నుంచి 586 మార్కులతో మండలంలో సెకండ్ ర్యాంకు సాధించిన మంచెం సత్యశ్రీ పద్మాదేవి, మండలం నుంచి 583 మార్కులతో థర్డ్ ర్యాంక్ సాధించిన సారిపల్లి కృష్ణ కావేరి అవార్డులకు ఎంపిక కావడం పట్ల విద్యార్థులను కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కార్యాలయ స్టాఫ్ అభినందించారు.



అవార్డులకు ఎంపికైన సత్యశ్రీ, కావేరి

ఘనంగా పృథ్వీరాజ్ చౌహాన్ జయంతి

తాళ్లరేవు : భారతదేశంపై అనేకసార్లు దండయాత్రలు చేసిన మహమ్మద్ ఘోరీని అంత మొందించిన పృథ్వీరాజ్ చౌహాన్ సేవలు ఎనలేనివని పలువురు కొనియాడారు. గాడిమొగ అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో పథ్వీరాజ్ 889వ జయంతిని గుడ్డివాని తూము సెంటర్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కాలాడి శివ, సంగాడి వీరబాబు, కోలా వీరబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి పెసింగి ఈశ్వర రావు, మల్లాడి ధర్మారావు, పినపోతు సతీష్, పోతాబత్తుల నూకరాజు, సంగాడి ధర్మారావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం రావి చెట్టు సెంటర్లో ఒక భవనంలో శనివారం పేకాడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఇన్‌ఛార్జి ఎస్ఐ ఎం.అశోక్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఏడుగురిని అదుపులో తీసుకున్నారు. వారి నుంచి రూ.3,400 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

పాము కాటుకు గురైన కూలీ మృతి

ప్రజాశక్తి కాజులూరు

పాము కాటుకు గురై చికిత్స పొందుతూ ఉపాధి కూలీ మృతి చెందాడు. ఎపిఒ వెంకటలక్ష్మి చెప్పిన వివరాల ప్రకారం శనివారం ఉదయం పంట కాలవ వద్ద ఉపాధి పనులు చేస్తుండగా పాలిక నాగేశ్వరరావు (75)ను తాచుపాము కరిచింది. సమీపంలో ఉన్న యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిగా చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మృతి చెందాడని తెలిపారు. నాగేశ్వరరావుకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగేశ్వరరావు మృతదేహాన్ని ఎపిఒ వెంకటలక్ష్మి, సర్పంచ్ చెరువూరి వెంకట సత్యనారాయణ రాజు పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మైక్రో ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్‌పై దాడి

ప్రజాశక్తి -కొవ్వూరు

వాడపల్లి గ్రామంలో టాటా క్యాపిటల్ లిమిటెడ్ మైక్రో ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ కె.తరుణ్‌కుమార్‌పై గెల్లా సతీష్ అనే వ్యక్తి దాడికి దిగాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వాయిదాల వాసూళ్ల నిమిత్తం తరుణ్‌కుమార్ వాడపల్లిలో కస్టమర్ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో కస్టమర్ పక్కింట్లో ఉంటున్న గెల్లా సతీష్ కలుగజేసుకుని నువ్వు ఏజెంట్ అనడానికి ఆధారాలు ఏవీ అంటూ ప్రశ్నించాడు. అంతేకాక సెల్ ఫోన్ లాక్కుని తరుణ్‌కుమార్ తలపై కొట్టాడు. దీంతో తరుణ్‌కుమార్ తలకు గాయమైంది. తనను దుర్భాషలాడి కొట్టినట్లు పట్టణ పోలీసులకు తరుణ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సి లలిత తెలిపారు.

బాలల రక్షణ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో శనివారం పడాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు విద్యా హక్కు చట్టం, పోక్సో చట్టం, బాల, బాలికలకు రక్షణ చట్టాలు వంటి వాటిపై అర్థమయ్యే రీతిలో వివరించారు. గేమ్ డెవలపర్ వెంకట సాయి సూర్య, వెబ్ డెవలపర్ హర్షిత్, రోబోటిక్స్ డెవలపర్ జమిలి ఆలీ అవగాహన కల్పించారు. బుద్ధా శ్రీనివాస్, దారపురెడ్డి కష్ణ, అంజలి, అనూష, జశ్విత, సందీప్, అమత, నమ్రత, లోకేష్, నీలపాల కృష్ణ వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్న బాల బాలికలందరికీ పాలకుర్తి మణికంఠ స్నాక్స్ అందజేశారు. గ్రంధి కామేశ్వరరావు సమ్మర్ క్యాంపు నిర్వహణకు సహకారం అందజేశారు. ఉదయం జరిగిన కరాటే శిక్షణలో పాల్గొన్న వారికి మిషన్ అన్నపూర్ణ సహాయనిధి ద్వారా వెలగా త్రిపుర, సుధీర్ గుడ్లు, అంబలి పంపిణీ చేశారు.

ఘనంగా లయన్స్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక గోకవరం రోడ్డులోని కోడూరి రంగారావు లయన్స్ జిల్లా కంటి హాస్పటల్ వద్ద శనివారం 108వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు హాజరై లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు మేల్విన్ జోన్స్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సంస్థని మేల్విన్ జోన్స్ స్థాపించారని, 206 దేశాలలో 44,500 క్లబ్బుల ద్వారా, 13 లక్షల మంది సభ్యులు సేవలు చేస్తున్నారని తెలిపారు. ఇక్కడ కంటి ఆసుపత్రిని ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.డయానా, హాస్పిటల్ ఇన్‌ఛార్జి గంగరాజు, తెలుగు యువత ఉపాధ్యక్షులు బద్ది సురేష్, ఆసుపత్రి సిబ్బంది, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ అని జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్‌లో మల్లిసాల గ్రామస్తులు లో ఓల్టేజ్ సమస్యపై విన్నవించడంతో అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని అదేశించారు. కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురం శివాలయం గ్రామ ప్రజలు చేపల చెరువు వివాదాన్ని పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. వీటితోపాటు తాగునీరు, రోడ్లు, తదితర సమస్యలపై ప్రజలు వినతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి వైస్ ఎంపిపి కుంచే రాజా, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్. అప్పలరాజు, అడబాల భాస్కర రావు, పాల్గొన్నారు.

శృంగార వల్లభునికి రూ 3.39 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.3,39,087 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ 2,23,360, అన్నదాన విరాళాల ద్వారా రూ.75,997, కేశఖండన ద్వారా రూ.8,720, తులాభారం ద్వారా రూ.600, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.29,910, స్వామి వారి కానుకలు రూ.500 ఆదాయం లభించినట్టు తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

కూటమి హామీలకు ఏడాది

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు ఏడాది పూర్తయినా ఆచరణలో అమలుకు నోచుకలేదనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. తాజాగా కోనసీమ జిల్లాలో నిర్వహించి ప్రజావేదిక కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరైన విషయం విధితమే. అయితే ఈ నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలు చేస్తామంటూ ఇచ్చిన హామీ కూడా అమలవుతుందో లేదో తెలీని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తయినా ఓ వైపు హామీలు అమలుకు నోచుకోక పోవడం, మరోవైపు పెరుగుతున్న ధరలు అదుపులో లేకపోవడం వంటి పరిణామాలు ప్రజలతో పాటు కూటమి నేతల్లోనూ వ్యక్తమవుతోంది. మరోవైపు పులిపై పుట్రలా కూటమి నేతల్లో పదవుల పంపకాలలో అసంతృప్తి ఒకొక్కటిగా వెలుగులోకి వస్తుంది. తాజాగా జరిగిన మహానాడు అసంతృప్తులకు వేదికగా మారింది. మరోవైపు రాష్ట్ర స్థాయి మహానాడుకు ఉమ్మడి జిల్లానుంచి అతి స్వల్పంగా కార్యకర్తలు తరలి వెళ్లారనే గుబులు అధికార పార్టీ ముఖ్య నేతల్లో ఇప్పటికే మొదలైంది. తాజాగా సీతానగరంలో ఇద్దరు ద్వితీయ శ్రేణి నాయకులు పదవులకు రాజీనామా చేసి అసంతృప్తిని వెళ్ల గక్కారు. ఇదే పరిస్థితి కొనసాగితే పంచాయతీ ఎన్నికల్లో ఫలితాలు తలకిందులయ్యే పరిస్థితి ఖాయమనే ఆందోళన ఆ పార్టీలో నెలకొంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుతో పెరుగుతున్న ధరలకు, పన్నుల భారాలకు కళ్లెం వేయకపోతే ప్రజా వ్యతిరేకత మూటకట్టుకోక తప్పదని తాజా పరిణామాలు మరోసారి హెచ్చరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార ప్రభుత్వం ఏ మేరకు ఆత్మవిమర్శ చేసుకుని తిరిగి ప్రజాభిమానం చూరగొంటుందో వేచి చూడాలి మరి.

ఠారెత్తిస్తున్న ఎండలు

భానుని ప్రతాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. రోహిణా కార్తె ప్రభావంతో ఉష్ణోగ్రతలు భగ్గుమంటున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉదయం 9 గంటల నుంచే ఎండలు ఠారెత్తిస్తున్నాయి. జిల్లాలో సరాసరి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరాయి. దీంతో మధ్యాహ్నం ప్రజలు బయటకు వచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో జిల్లా కేంద్రాలతో పాటూ ప్రధాన కూడళ్లు సైతం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వేసవి తాపం నుంచి సేదతీరేందుకు ప్రజలు కొబ్బరి బోండాలు, శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. అయితే చలివేంద్రాలు ఏర్పాటు చేయటంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు వెనుకపడ్డాయి. దీంతో సామాన్యుల పరిస్థితి దయనీయంగా మారింది. వైద్య ఆరోగ్య శాఖ సైతం అప్రమత్తత లేకపోవటంతో అక్కడక్కడా వడదెబ్బ మృతులు నమోదవుతున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపి ప్రజారోగ్యం కాపాడాల్సిన బాధ్యతను తీసుకోవాలి.

విద్యావేత్త చిరంజీవినీకుమారి అస్తమయం

ప్రముఖ విద్యావేత్త, ఐడియల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి ఈ నెల 1న తుది శ్వాస విడిచారు. సాహితీ వేత్తగా, సామాజిక వేత్తగా, సంఘ సంస్కర్తగా, విద్యావేత్తగా ఆమె తెలుగు ప్రజలకు సుపరిచితులు. రచయితగానూ ఆమె రాణించారు. ఆంగ్ల అధ్యాపకరాలిగా ఆమె ప్రయాణం మొదలు పెట్టారు. ఎంఎ పట్టా అందుకున్న తరువాత రంగరాయ మెడికల్ కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా పనిచేశారు. 1970లో ఐడియల్ జూనియర్ కాలేజీని స్థాపించారు. అదే ఒరవడిలో 1974లో డిగ్రీ కాలేజీని ప్రారంభించారు. 1980 ప్రాంతంలో వీటికి ప్రభుత్వ ఎయిడెడ్‌ను కూడా సాధించారు. కేవలం విద్యకు మాత్రమే పరిమితం కాక అభ్యుదయ కార్యక్రమాలను నిర్వహించారు. 1980లో ఆల్ ఇండియా పీస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఇదే కళాశాలలో మహాకవి శ్రీశ్రీ సప్తపతి ఉత్సవాలు కూడా జరిపారు. ఇన్కస్ తరపున భారతదేశ నుంచి 1970లో సోవియట్ యూనియన్ వెళ్లే అవకాశం వచ్చింది. ఈ బందానికి చిరంజీవిని కుమారి లీడర్‌గా వ్యవహరించారు. ఆర్మీనియాలో మాన్యా అనే రచయితతో అక్కడ పరిచయం ఏర్పడింది. ఆయన కథల పుస్తకం ఆమెతో పాటు తెచ్చుకుని ఇండియాకి వచ్చిన తర్వాత వాటిని ఆర్మేనియా కథలు పేరిట అనువదించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆవిర్భావ నుంచి ఆమె క్రియాశీలకంగా వ్యవహరించారు. అరసం కార్యకలాపాలు తగ్గిన తర్వాత అదే బావ సారూప్యత కలిగిన వారితో కాకినాడలో తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘాన్ని ఏర్పాటు చేసి అభ్యుదయ భావజాలాన్ని ప్రచారం చేయడానికి కషి చేశారు. భారత జ్ఞాన విజ్ఞాన సమితి జిల్లా శాఖ అధ్యక్షురాలుగా, ఏపీ ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘం అధ్యక్షురాలుగా, ఆంధ్రా యూనివర్సిటీ కళాశాల యాజమాన్య సంఘం అధ్యక్షురాలుగా, జిల్లా సాక్షరతా సమితి సభ్యురాలుగా, గిరిజన ప్రాంత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శిగా, ఇండియన్ సొసైటీ ఫర్ సోషల్ డైనమిక్స్ అధ్యక్షురాలుగా, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులుగా ఇలా పలు సంస్థలలో ఆమె బాధ్యతాయుతమైన పదవులు నిర్వహించారు.



పనిగంటల పంపుపై కార్మికులు భగ్గు

పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్న కేంద్రంలోని బిజెపీ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం వంత పలకడంపై కార్మికులు, కార్మిక సంఘాలు భగ్గుమంటున్నాయి. తాజాగా 8 గంటల పనివిధానాన్ని 12 గంటలకు మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సంపద్ను సృష్టించేంది పారిశ్రామిక వేత్తలేనంటూ వక్రభాష్యం చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు కార్మికులపై పని భారం మోపడం ఎందుకనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ఇటువంటి నిర్ణయాలను వెనక్కి తీసుకోకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

నాణ్యమైన విద్య రిఫరల్ స్కూల్ లక్ష్యం

ప్రజాశక్తి-శంఖవరం



గ్రామీణ ప్రాంతంలో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే రిఫరల్ స్కూల్ లక్ష్యమని చైర్మన్ విజయ్ బాబు తెలిపారు. విద్యార్థుల బంగారు భవితకు రిఫరల్ స్కూల్ పునాది లాంటిదన్నారు. ప్రతి ఏడాదీ విద్యార్థులతో కలిసి ఉత్తమ ఫలితాలను అందిస్తూ ఒక ప్రత్యేకతను చాటుకుంటుందని ఆయన తెలిపారు 2016-17లో 52 మంది అభ్యర్థులకు పది గ్రేడ్ పాయింట్లు సాధించారని అప్పటినుండి ప్రతి సంవత్సరం వరుసగా పాయింట్లు ఫలితాలు పొందుతున్నామని తెలిపారు. అదే గ్రాఫ్‌తో 2024 25లో తమ స్కూల్ నుండి 46 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా 100 శాతం మంది విద్యార్థులకు ఫస్ట్ క్లాస్ మార్కులు రాగా వారిలో 20 మంది విద్యార్థులకు 500 మార్కులు సాధించారన్నారు ఇంకా మొదటి రెండు మూడు ర్యాంకులు తమ విద్యార్థులకు రావడం రిఫరల్ స్కూల్ నాణ్యమైన విద్యను అందిస్తుంది అనడానికి పై ఫలితాలు నిదర్శనమని చెప్పారు.



విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం

స్కూల్ ప్రత్యేకతలు

- సువిశాలమైన తరగతి గదులు, అనుభజ్ఞులైనఉపాధ్యాయులు
- ప్రతి తరగతిలోనూ పరిమిత సంఖ్యలో విద్యార్థులు.
- వికలాంగ విద్యార్థులకు ప్రత్యేక రాయితీ
- కంప్యూటర్ శిక్షణ, అత్యాధునిక కెమిస్ట్రీ ల్యాబ్స్, బోటనీ ల్యాబ్స్
- విలువైన పుస్తకాలతో కూడిన అత్యాధునిక సెంట్రల్ లైబ్రరీ
- డాక్టర్లతో మెడికల్ కేర్ సదుపాయాలు
- మారుమూల ప్రాంతాలకు బస్ సౌకర్యం
- ప్రతి తల్లిదండ్రులతో సమావేశం
- సువిశాలమైన ఆటస్థలం, యోగా తరగతులు
- ప్రతి నెలా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహణ

మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని ధర్నా

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి, గొల్లప్రోలు

ఎస్‌జిటి ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ అని చెప్పి ఇప్పుడు వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించడం దారుణమని, ఉపాధ్యాయులు అన్నారు. శనివారం మండల కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ వెబ్ కౌన్సిల్ ద్వారా బదిలీలను నిలుపుదల చేసి మాన్యువల్ ద్వారా బదిలీలను పునరావృతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకి అనుకూలమైన మాన్యువల్ కౌన్సిలింగ్ వెంటనే జరిపే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

గొల్లప్రోలు ఉపాధ్యాయ ఎస్‌జిటిల బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అనిశెట్టి సీతారామరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్‌జిటి బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్ వేతనాన్ని రద్దు చేసి మాన్యువల్ కౌన్సిలింగ్ విధానాన్ని జరిపించాలన్నారు. అనంతరం డివైఇఒ నాయుడు వెంకటేశ్వరరావు, ఎంఇఒ బొడ్డేటి శివప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు గడ్డమూరి ఈశ్వరరావు, మేడసాని సత్యనారాయణ, నాయకులు దాడి పద్మనాభం, వానపల్లి సూర్యం, బొండాడ నాగబాబు, ఎస్.సురేష్ కుమార్ నేమాల రాంబాబు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు



యు.కొత్తపల్లిలో ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-కాజులూరు

ఆధునిక వ్యవసాయ పద్ధతుల రైతులు అవగాహన కలిగి ఉండాలని ఐకార్ నిర్కా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎల్‌కె.ప్రసాద్ శనివారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శీల గ్రామంలో రైతు సేవ కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎల్‌కె.ప్రసాద్ వికసిత కృషి సంకల్ప అభియాన్ ముఖ్య ఉద్దేశాన్ని రైతులకు వివరించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను శాస్త్రవేత్తలు నేరుగా రైతులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం రూపొందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను రైతులకు తెలిపారు. మట్టి పరీక్షలపై అవగాహన, సాగు నీరు విడుదల చేసిన వెంటనే తొలకరి పంటకు త్వరితగతిన సన్నద్ధం అయ్యేలా రైతులు ముందుకు రావాలని మండల వ్యవసాయ అధికారి వి.అశోక్ కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.నాగేశ్వర రెడ్డి, డాక్టర్ రవీంద్ర, పి.సత్యనారాయణ, వై.శ్రీనుచ, వి.రాజు మోహన్, గ్రామ సర్పంచ్ కోమలి వెంకట రమణ, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.రామకష్ణ పాల్గొన్నారు.

32వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 32వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజినీరింగ్ కార్మికులు నిరసన వ్యక్తం చేస్తూ వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెద్దాపురం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ 32 రోజులుగా ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. కార్మికులకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాసిన భద్రరావు, వాకాడ భాస్కరరావు, ఆకుల రామకృష్ణ, అయ్యప్ప స్వామి, ఒ.సౌమ్య, కె.వెంకటరమణ, సత్తిరాజు, ఎస్‌కె.బషీర్, పి.ప్రశాంత్, ఎస్.శివకుమార్, మహాపాతిన అరుణ్ కుమార్, డి.రాజు పాల్గొన్నారు.



నిరసన దీక్షలో పాల్గొన్న కార్మికులు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

దివిలి గ్రామానికి చెందిన దమ్ము సత్తిబాబుకు గుండె ఆపరేషన్ నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.66,700 శనివారం టిడిపి మండల అధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పంపిణీ చేశారు. తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, బుజ్జి, మొయిళ్ల చంటి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

పలుచోట్ల ఘనంగా బక్రీద్ ప్రార్థనలు

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట, యానాం

పెద్దాపురం ముస్లిం అంజుమన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఈద్గా మెట్టపై బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ కరీమ్‌జానీ, సయ్యద్ ఖాదర్, ఆశిక్ ఆలీ, ముగ్బల్ జానీ, అమీర్, అబ్దుల్ రజాక్, షేక్ సుభానీ, బాబూలాల్, షేక్ ముస్తఫా, షేక్ అబ్దుల్ నబి, పట్టణ ముస్లిం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామర్లకోట బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు సామర్లకోటలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. కోటపేట, పెన్షన్ లైన్ ప్రాంతాల్లోని నాలుగు మసీదులలో ప్రత్యేక నమాజ్ కార్యక్రమాలు చేపట్టారు. కుటుంబసమేతంగా ముస్లిం ప్రజలు మసీదులకు హాజరై ప్రార్ధనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మసీదు నాయకులు తాహిర్, ఎండి.రిజ్వాన్, అబీబుల్లా, సఫీయుల్లా, సైపుల్లా, అజ్జు, మామ, బాషీ, నయీమ్, నిస్సార్ పాల్గొన్నారు.

యానాం : త్యాగానికి, సహనానికి, ఐక్యమత్యానికి బక్రీద్ పర్వదినం ప్రతీకగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. శనివారం బక్రీద్‌ను పురస్కరించుకుని స్థానిక చారిత్రక జామియా మసీదు, వెంకటరత్నం నగర్‌లోని మసీదులో అధిక సంఖ్యలో ముస్లిములు ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్ మహ్మద్ రఫీ, మహ్మద్ యజ్ఞానీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు తాజుద్దీన్‌బాషా, ఎండి కాలేషా, రిజ్వాన్, ఎస్‌కెఎం జిలానీ, బిస్మిల్లా యూత్ పాల్గొన్నారు.